సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 3 । ఆగస్టు । 2025



ఏకతాటిగా సిరులు

తాటి నీరాతో ఉత్పత్తుల తయారీపై హెచ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలను ఇచ్చాయి.

8లో



బహుభాషా జర్నల్ ఆవిష్కరణ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరించారు.



ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణలక్ష్మి పూజలు ఘనంగా జరిగాయి.

న్యూస్‌రీల్

149 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న నగరప్రజలు

డాబాగార్డెన్స్ (విశాఖ): జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి పురస్కరించుకొని నగర వీధుల్లో 149 అడుగుల భారీ జాతీయ జెండాను శనివారం ప్రదర్శించారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాతనగరం నుంచి టౌన్ పోలీస్ స్టేషన్ దరి రాణి బొమ్మ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్లమెంట్‌లో వెంకయ్య విగ్రహాన్ని ప్రతిష్టించడంతోపాటు భారతరత్న బిరుదు ప్రకటించాలని కోరారు. టి.కృష్ణ, సీహెచ్ నూకరాజు, సీమెన్ భాష పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

చూడి పశువు కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు

- శస్త్రచికిత్స చేసి తొలగించిన పశువైద్యాధికారులు



చూడి పశువుకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న పశువైద్యాధికారి శివకుమార్



చూడి పశువు కడుపులో నుంచి తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, సంచులు

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది ఎస్సీ కాలనీ నివాసి కోరుకొండ రాముకు చెందిన చూడి పశువు కడుపులో పెద్ద ఎత్తున ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ సంచులను శస్త్ర చికిత్స ద్వారా పశువైద్యాధికారులు తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి రాముకు చెందిన చూడి పశువు 15 రోజులుగా మేత వేయడంలేదు.దీంతో పాటు కడుపు పొంగుతో బాధపడుతోంది. రాము శనివారం వడ్డాది పశువైద్యశాలకు తన పశువును తీసుకెళ్లాడు. బుచ్చెయ్యపేట పశువైద్యాధికారి డాక్టర్ పద్మజ చూడి పశువును పరీక్షించి, శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. కె.జె.పురం ఇన్‌చార్జి పశువైద్యాధికారి శివకుమార్ పశువుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. కడుపులోంచి ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ తాడులను తొలగించారు. శస్త్ర చికిత్స చేసి పశువు ప్రాణాలు కాపాడిన పశువైద్యాధికారులకు రైతు రాము కృతజ్ఞతలు తెలిపాడు.

కానిస్టేబుళ్లుగా కాబోయే భార్యాభర్తలు






వంతాల అశోక్, దొంకా అమ్మాజీ

రావికమతం: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో పలువురు అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించారు. వీరిలో మండలంలో కొత్త కోట్నాబిల్లి ఎస్సీ కాలనీకి చెందిన వంతాల అశోక్ 113 మార్కులు సాధించి ఏపీ ఎస్పీ కానిస్టేబుల్‌గా,పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన దొంకా అమ్మాజీ 120 మార్కులు సాధించి సివిల్ మహిళా పోలీస్‌గా ఎంపికయ్యారు.ఈ యువతీ యువకులు ఇద్దరూ మేనత్త, మేనమామ పిల్లలు,ఇద్దరికీ వివాహం నిశ్చయమైంది.పది రోజుల్లో వీరి నిశ్చితార్థం కార్యక్రమం జరగనుంది. కాబోయే భార్య,భర్తలు ఒకే ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకొన్నారు. మొదటి ప్రయత్నంలోనే ఇద్దరూ కానిస్టేబుల్ కొలువులు సాధించారు. అశోక్ తల్లిదండ్రులు నూకరాజు,అప్పలరత్నం, అమ్మాజీ తల్లిదండ్రులు నూకరాజు,చింతల్లి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వివాహం చేస్తామని వారు తెలిపారు. ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగం రావడంతో రెండు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.ఇద్దరిని వారి వారి గ్రామాల్లో పలువురు అభినందించారు.

జిల్లాకు జ్వరమొచ్చింది..



అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్లు



- పెరుగుతున్న డెంగ్యూ, టైఫాయిడ్ బాధితులు
- ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులే
- రోగుల్లో క్రమంగా తగ్గుతున్న ప్లేట్‌లెట్లు
- పీహెచ్‌సీలలో రక్తపరీక్షల సౌకర్యం లేక గుర్తించడంలో ఆలస్యం
- 'ఫ్యామిలీ డాక్టర్' కనుమరుగై అనారోగ్యంతో మగ్గుతున్న పల్లెలు

ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఏ ఇంట చూసినా సుస్తీ చేసిన మనుషులే కనిపిస్తున్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో రక్తపరీక్షల సదుపాయం పూర్తి స్థాయిలో లేక ప్లేట్‌లెట్లు తగ్గుతున్నాయని గుర్తించేసరికే ఆలస్యమవుతోంది. ఇది రోగులను మరింత కుంగదీస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో **వైద్యరంగంపై ప్రత్యేక** దృష్టి ఉండేది. ఫ్యామిలీ డాక్టర్ **విధానం పల్లె ప్రజలను ఎంతో ఆదుకుంది.** 104 సేవలు సక్రమంగా **అందేవి. ఇప్పుడు ఆ వ్యవస్థ పడకేయడంతో** గ్రామీణ ప్రాంతాల్లో వైద్య రంగం **దీనావస్థలో ఉంది. ఇదే అదనుగా పలు ప్రైవేటు ఆస్పత్రులు** రోగులను పీల్చిపిప్పి **చేస్తున్నాయి.**

గొలుగొండ మండలం చోద్యం సచివాలయ పరి**ధిలో విప్పలపాలెం గ్రామంలో** డెంగ్యూ, టైఫా**యిడ్ జ్వరాలు ప్రజలను పీడిస్తు**న్నాయి. **ఆ గ్రామం మొత్తం జనాభా సుమారు** 500 కాగా **అందులో** 100 **మందికిపైగా డె**ంగ్యూ, చికున్ **గున్యా, టైఫాయిడ్, మలేరియా,** సీజనల్ వ్యాధు**లతో బాధపడుతున్నారు. ఆ గ్రామం**లో మూడేళ్ల **పాప నుంచి వృద్ధుల వరకు జ్వరాలతో** బాధపడు**తున్నా.. గ్రామ సచివాలయ సెక్రటరీ**గానీ, ఏఎన్ఎం గానీ, **సమీప ఎంఎల్‌హెచ్‌పీ,** గొలుగొండ, **కేడీ పేట పీహెచ్‌సీల పరిధిలో వైద్య** సిబ్బంది గానీ **ఆ వైపు చూసిన పాపాన పోలేదు. కనీసం** పేరాసె**టిమాల్ టాబ్లెట్ ఇచ్చే నాథులు కూడా** లేరు.



సాక్షి, అనకాపల్లి:

జిల్లాలో డెంగ్యూ, **టైఫాయిడ్, మలేరియా** జ్వరాలు విజృంభిస్తున్నాయి. **ఇంటికి ఇద్దరు,** ముగ్గురు చొప్పున **మంచాన పడుతున్నారు.** ఏజెన్సీని ఆనుకొని ఉన్న **మండలాల్లో పరిస్థితి** మరింత దారుణంగా ఉంది. **ప్రభుత్వానికి ప్రత్యేక** ఆరోగ్య శిబిరాలు నిర్వహించా**లన్న ధ్యాస కరువైం**ది. గత వైఎస్సార్‌సీపీ ప్రభు**త్వం అమలు చేసిన** ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఇప్పు**డు కనుమరుగు కావ**డంతో ముఖ్యంగా గ్రామీణ **ప్రాంతాల** ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంటికే వైద్యం అందిన ఆ రోజులను తలచుకొని, ఇప్పుడు ఆస్పత్రికి వెళ్లినా చికిత్స సక్రమంగా అందని దైన్య స్థితిని చూసి ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలో ఒక డిస్ట్రిక్ట్ ఆస్పత్రి, మూడు ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 45 పీహెచ్‌సీలు, 9 యూపీహెచ్‌సీలు **న్నాయి. రోజువారీగా 3,600 నుంచి 3,700 వరకూ ఓపీలు నమోదవుతాయి. ఇందులో 70 శాతం జ్వర పీడితులే** కావడం గమనార్హం. గత వారం రోజు**లుగా సీజనల్ జ్వరాలు పెరగడంతో గణనీయంగా ఓపీలు పెరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ ఫీవర్ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో వైద్యశాఖ వైఫల్యం స్పష్టంగా కనపడుతుంది. ఫ్లూయిడ్స్ కొరత ఉంది. యాంటిబయోటిక్ ఇంజక్షన్‌లు, మలేరియా,** డెంగ్యూ మందుల కొరత **కూడా** ఉన్నట్లు సాక్షి పరిశీలనలో వెల్లడైంది. జ్వరాల నివారణకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, దోమల తెరల పంపిణీ వంటి చర్యలేవీ కానరావడం లేదు.

దోమల కిట్లు ఎక్కడ..?

ఏజెన్సీ ప్రాంతాన్ని ఆనకుని ఉన్న గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో **సీజనల్ జ్వరాలు చుట్టుముడతాయని తెలిసి కూడా జిల్లా యంత్రాంగం కనీసం దోమల తెరలు కూడా పంపిణీ చేయలేదు. జిల్లాలో వందలాది ఫార్మా కంపెనీలున్నాయి. వాటి నుంచి వచ్చే సీఎస్సార్ నిధులతో గతంలో దోమల తెరలు పంపిణీ చేశారు. ఈ ఏడాది కనీసం జిల్లా ఉన్నతాధికారులు, వైద్యశాఖ అధికారులు కనీసం ఆ ఆలోచన కూడా చేసిన పాపానలేదు.**

రక్త పరీక్షల సదుపాయమూ కరువే..

అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, నక్కపల్లి, యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రి మినహా మిగిలిన చోట్ల డెంగ్యూ నిర్ధారిత రక్త పరీక్షల సదుపాయం లేదు. ఒకవేళ పరీక్షలు చేసినా మూడు, నాలుగు రోజులపాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈలోపు బాధితులకు ప్లేట్‌లెట్ కౌంట్ క్రమేపీ తగ్గిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యంపై నమ్మకం లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నా.. సంబంధిత అధికారుల పర్యవేక్షణే కరువైంది. జిల్లాలో 30కి పైగా పీహెచ్‌సీల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ఇంజక్షన్లు, మందులు అందుబాటులో లేవు. మాడుగుల మండలంలో కె.జె.పురం, కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పలుచోట్ల వైద్య సిబ్బంది కొరత కూడా వుంది.

గ్రామాల్లో వైద్య సేవల కొరత



మా గ్రామంలో గత నెల రోజులుగా ప్రతి ఇంటిలో ఇద్దరు ముగ్గురు డెంగ్యూ, చికున్ గున్యా జ్వరాల బారిన పడుతున్నారు. నాతో పాటు మా ఇంటిలో నలుగురికి జ్వరం వచ్చింది. మా పెద్ద పాపకు ఎనిమిదేళ్లు, చిన్న పాపకు ఐదేళ్లు. ఇద్దరికీ చికున్ గున్యా జ్వరం వచ్చింది. గ్రామమంతా అనారోగ్యంతో బాధపడుతుంటే మెడికల్ సిబ్బంది వచ్చి చికిత్స అందించిన దాఖలా లేదు. దోమల మందు కొట్టించమని గ్రామ సెక్రటరీని వేడుకుంటే కనీసం పట్టించుకోలేదు.

– **లగుడు శ్రీను**, విప్పలపాలెం, గొలుగొండ మండలం

స్నేహమేరా జీవితం..

- రైలు ప్రయాణికులే సభ్యులుగా బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఏర్పాటు
- అనకాపల్లిలో 25 సంవత్సరాలుగా కొనసాగుతున్న స్నేహం



అనకాపల్లి: సాధారణంగా రైల్లో కలిసే స్నేహాలు, అనుబంధాలు తాత్కాలికం అంటారు. కలిసి ప్రయాణిస్తూ ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకున్న వారు సైతం రైలు దిగిన వెంటనే ఒకరినొకరు మరచిపోతారు. ఎవరి పనుల్లో వారు నిమగ్నమవుతారు. కానీ వీరు అలా కాదు.. ప్రతి రోజూ ఒకే రైల్లో ప్రయాణించడం వల్ల కాబోలు వారి స్నేహాన్ని శాశ్వతం చేసుకున్నారు. బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ స్థాపించి కుటుంబ సభ్యులతో సహా అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన మాదేటి ఈశ్వరరావు వ్యాపారరీత్యా అనకాపల్లి–విశాఖ డైలీ పాసింజర్ రైల్లో నిత్యం ప్రయాణించేవారు. అలా అనకాపల్లి నుంచి విశాఖ వచ్చే ఉద్యోగులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఆయనకు ఎంతో దగ్గరైపోయారు. అలా మిత్రులైన తోటి ప్రయాణికులతో కలిసి 2000 సంవత్సరంలో బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్‌లో బుద్ద రామకృష్ణ, పెంటకోట నర్సింగరావు, కర్రి గంగాధర్, పి.ఎస్.అప్పారావుతోపాటు 60మంది స్నేహితులతో కలిసి క్లబ్ స్థాపించారు. కుటుంబ సమేతంగా సభ్యులుగా చేరారు. ప్రస్తుతం 500 కుటుంబాల వారు ఈ క్లబ్‌లో ఉన్నారు. వీరు ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడమే కాక అనేక ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాల వితరణ చేస్తారు. ఆస్పత్రుల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తారు. క్లబ్‌లో సభ్యుల జన్మదినాన్ని పురస్కరించుకుని వారి ఇంటికి ప్రత్యేక గిఫ్ట్ పంపిస్తారు. స్నేహితుల దినోత్సవానికి 15 రోజుల ముందుగా క్లబ్ సభ్యులకు రన్నింగ్, క్రికెట్ వంటి ఆటలు పోటీలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా స్నేహితుల దినోత్సవాన్ని స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలో ఉన్న సత్య గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం కుటుంబ సమేతంగా నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు చెప్పారు.



ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు (ఫైల్)

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ధర్నా



ఉపాధ్యాయుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

తుమ్మపాల: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు అప్పగించిన బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే 12వ పీఆర్‌సీని ప్రకటించి, ఐఆర్ 30 శాతం చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సుధాకరరావు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఎంఈవోలు గ్రేడ్-2 హెచ్ఎంలుగాను, గ్రేడ్-2 హెచ్ఎంలు ఎంఈవోలుగా మారేందుకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కో–చైర్మన్ ఎ.వీ.హెచ్.శాస్త్రి, ఎం.జానకీరామనాయుడు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి.చిన్నబ్బాయి, ఎస్.దుర్గాప్రసాద్, ఆచంట రవి, కార్యవర్గ సభ్యులు శేఖర్, ధర్మారావు, ఎం.శ్రీనివాసరావు, పరదేశి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



రైతులకు విడుదల చేసిన నగదు చెక్ నమూనా చూపిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం: కాలానుగుణంగా వస్తున్న నూతన పద్ధతుల్లో రైతులు వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. మొదటి విడత అన్నదాత సుఖీభవ పథకం నగదు విడుదల నేపథ్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో 2,31,000 మంది రైతులకు ఈ పథకం లబ్ధి చేకూరినట్టు చెప్పారు. నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి టౌన్: స్థానిక గుండాల జంక్షన్ వద్ద ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ' సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ముందుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ ప్రసంగాలను వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతగా జిల్లాలో ఉన్న 2,42,536 మంది రైతుల ఖాతాల్లో 161.45 కోట్ల రూపాయలు జమ చేస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి బాబు మోసాలు



యలమంచిలి మండలం బయ్యవరంలో ప్రజలకు బాబు మోసాలను వివరిస్తున్న కరణం ధర్మశ్రీ



అనకాపల్లి పాత బర్మాకాలనీలో సూపర్ సిక్స్ మోసాలను ప్రజలకు వివరిస్తున్న సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వం కుటిల పాలనను ఎండగడుతున్నారు. గ్రామగ్రామాన రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్నారు. యలమంచిలి మండలం ఏటికొప్పాక, పద్మనాభరాజుపేట, బయ్యవరం, ములకలాపల్లి గ్రామాల్లో నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుతో కలిసి పర్యటించారు. గత 14 నెలల కాలంలో ప్రజలు ఎంత నష్టపోయిందీ వివరించారు. దీంతో పలువురు గ్రామస్థులు స్పందిస్తూ వైఎస్ జగన్ పాలనతో ప్రస్తుత కూటమి పాలనను బేరీజు వేసుకుని జగన్ పాలన ప్రయోజనాలను గుర్తు తెచ్చుకున్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు క్యూఆర్ కోడ్‌తో ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. అనకాపల్లి పట్టణంలోని పాత బర్మాకాలనీలో వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజులతో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పర్యటించారు. ఒక మోసగాడు.. వేషగాడు కలిసి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

–యలమంచిలి/అనకాపల్లి

క్వారీ బాధితుల అర్ధనగ్న ప్రదర్శన



అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ బాధితులు శనివారం వినూత్న రీతిలో అర్ధనగ్న ప్రదర్శన జరిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్ష శిబిరం నుంచి అబిద్‌సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. క్వారీ అనుమతులను రద్దు చేయకపోతే రెండు రోజుల్లో నర్సీపట్నాన్ని స్తంభింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆసక్తి గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. జిల్లాలో గల ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు మినహాయించి అన్ని కేటగిరీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ నెల 8లోగా యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

బస్సుల కండిషన్ మెరుగుపరచాలి



డీఎం ధీరజ్, గ్యారేజ్ సిబ్బందితో సమావేశమైన ప్రజారవాణా శాఖ జిల్లా అధికారి ప్రవీణ

నర్సీపట్నం: ఆర్టీసీ బస్సుల కండిషన్ మెరుగుపరచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి వి.ప్రవీణ డిపో సిబ్బందిని ఆదేశించారు. ఆమె డీఎం ధీరజ్, గ్యారేజ్ సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. గ్యారేజ్ ఇన్‌చార్జి ఆచారి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిఫెన్స్ మద్యం స్వాధీనం



డిఫెన్స్ మద్యం బాటిళ్లతో నిందితుడు, పక్కన ఎక్సైజ్ సిబ్బంది

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం చంద్రయ్యపాలెం బస్టాప్ వద్ద డిఫెన్స్ మద్యం తరలిస్తున్న నిందితుడిని శనివారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అదే మండలం వజ్రగడకు చెందిన గాజుల సత్తిబాబు(32) 14 మద్యం సీసాలను వేరే చోట అమ్మేందుకు తీసుకువెళ్తూ పట్టుబట్టాడు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వై.నాగశంకర్, గోవర్ధన్, నారాయణ రావు, లావణ్య పాల్గొన్నారు.

పెద్దేరులో 120 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయం నుంచి 120 క్యూసెక్కులు వరద నీరు వదిలినట్టు జేఈ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136 మీటర్లకు చేరిందన్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 58 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. జలాశయం ప్రధాన రాచకట్టు, ఆర్‌ఎంసీ పంట కాలువలకు చెరొక 60 క్యూసెక్కులు సాగు నీరు విడుదల చేశామని తెలిపారు.

సమర్థవంతంగా విద్యాబోధన



శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

సబ్బవరం: శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను వినియోగించుకుని సమర్థవంతంగా విద్యాబోధన సాగించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన మొదటి విడత ఇన్ సర్వీస్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలుగు బోధన సమయంలో విద్యార్థులను ఆకట్టుకునేలా పాటలు, కథలు మొదలైన ప్రక్రియ ద్వారా బోధన సాగాలన్నారు. విద్యార్థులతో మంచిగా వ్యవహరించాలని, లేకపోతే డ్రాపౌట్ అయ్యే ప్రమాదముందన్నారు. దానికి తానే ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. జీవితాలను మలుపు తిప్పే మంచి ఉపాధ్యాయులను విద్యార్థులు చిరకాలం గుర్తుంచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాష్, స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ శేషగిరి, సబ్బవరం ఎంఈవో జె.రవీంద్ర, ఏఎస్‌డీ జమున, ఏఎంవో కెజియో, ఆర్పీలు పాల్గొన్నారు.

ఏకతాటిగా సిరులు

ఆంధ్రా కల్పవృక్షానికి మంచి రోజులు



తాటిచెట్టు ప్రకృతి ప్రసాదించిన కల్పతరువు. ఈ వృక్షంలోని ప్రతి భాగం వృథా కాకుండా బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడుతోంది. అలాంటి తాటిచెట్లు కొందరి స్వార్థ ప్రయోజనాలకు నేలకొరుగుతున్నాయి. ఈ పరిణామాలతో తాటిచెట్లు కాలక్రమేణా అంతరించి పోతున్న నేపథ్యంలో వీటి పరిరక్షణకు పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం సంకల్పించింది. వీటి ద్వారా అనుబంధ ఆహార ఉత్పత్తులు తయారుచేస్తూ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేస్తున్న కృషికి మంచి ఫలితాలు వస్తున్నాయి.



- తాటి నీరాతో ఉత్పత్తుల తయారీపై విస్తృత పరిశోధనలు
- ఇప్పటికే పలు ఆహార ఉత్పత్తులు పరిచయం
- తాజాగా పండు గుజ్జుతో పానీయం
- అందుబాటులోకి తేనున్న పందిరిమామిడి హెచ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు
- తాటి చెట్ల సంరక్షణతోపాటు గిరిజనులకు మంచి ఆదాయ వనరు



అందుబాటులోకి రానున్న తాటిగుజ్జుతో తయారు చేసిన పానీయం

రంపచోడవరం: అంతరించిపోతున్న తాటి చెట్ల పరిరక్షణకు పందిరిమామిడి డా.వైఎస్సార్ ఉద్యాన పరిశోధనస్థానం (హెచ్‌ఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు విశేష కృషి చేస్తున్నారు. అఖిల భారత తాటి సమన్వయ పరిశోధన పథకంలో భాగంగా 1993 నుంచి ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి. తాటి చెట్ల నుంచి సేకరించిన నీరాపై జరిపిన పరిశోధనలు అనేక ఆహార ఉత్పత్తుల తయారీకి దోహద పడ్డాయి. తాటి పండ్ల నుంచి వచ్చే గుజ్జుతో మజా తరహాలో తయారుచేసిన పానీయం సోమవారం నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు స్థానిక పరిశోధన స్థానంలో విక్రయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- దేశంలో దాదాపుగా 15 కోట్ల తాటి చెట్లు ఉండగా ఒక్క మన రాష్ట్రంలో మూడున్నర కోట్లకు పైగా ఉన్నాయి. ఇక్కడ పరిశోధనల నిమిత్తం 272 రకాల చెట్లు ఉన్నాయి. వీటి నుంచి సేకరించిన నీరాతో తాటి బెల్లం, తేగల నుంచి నూక, బిస్కెట్లు, జెల్లీ వంటి సుమారు 20 రకాల ఆహార పదార్థాలను విజయవంతంగా తయారుచేశారు. తాజాగా తాటి పండు గుజ్జు నుంచి పానీయం (డ్రింక్)ను హెచ్‌ఆర్‌ఎస్ సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. పీసీ వెంగయ్య అభివృద్ధి చేశారు. తాటి గుజ్జులో సమపాళ్లలో నీటిని కలిపి మిక్స్ చేయడం ద్వారా ఎనర్జీ డ్రింక్‌ను రూపొందించారు. తాటి చెట్టు నుంచి పండు పడిన మూడు గంటల్లో సేకరించడం ద్వారా ఆరోగ్యవంతమైన గుజ్జును పొందవచ్చని శాస్త్రవేత్త వెంగయ్య తెలిపారు. పానీయం తయారు విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. సేకరించిన పండ్లను వేడి నీటితో శుభ్రం చేయడం వల్ల పానీయానికి అవసరమైన మంచి గుజ్జును సేకరించవచ్చు.
- ఎక్కువ మొత్తంలో లభించే తాటి గుజ్జును నిల్వ చేయడంపై హెచ్‌ఆర్‌ఎస్‌లో జరుగుతున్న పరిశోధనలు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడి తాటి వనం నుంచి సేకరించిన తాటిపండ్ల గుజ్జును నిల్వ చేసి అధ్యయనం చేస్తున్నారు. రోజురోజుకు మార్కెట్లో తాటి ఆహార ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడడంతో గిరిజనులకు మంచి ఆదాయం వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. తాటి గుజ్జులో పోషక విలువలు ఉన్నాయి. ఐరన్, అధికంగా పోటాషియం, పాస్పరస్, మినరల్స్, విటమిన్ –సీ ఉన్నాయని వారు పేర్కొన్నారు.



ఉత్పత్తుల తయారీలో నిమగ్నమైన గిరి మహిళలు

అందుబాటులోకి పానీయం



తాటి పండు గుజ్జు మంచి పోషకం. దీని ద్వారా తయారు చేసే ఆహార ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని విస్తృత పరిశోధనలు చేస్తున్నాం. ఇప్పటికే చాలా రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చాం. తాజాగా పానీయం (డ్రింక్) కూడా తెస్తున్నాం. తాటి ఆహార ఉత్పత్తుల తయారీపై గిరిజనులకు శిక్షణ ఇచ్చి మంచి ఆదాయం పొందేలా తీర్చిదిద్దుతాం.

–డా. పీసీ వెంగయ్య, ప్రధాన శాస్త్రవేత్త, పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానం

నూతన విద్యా విధానంలో
అప్‌డేట్ కావాలి

- విశాఖ ఒకటో జోన్ ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్




మాట్లాడుతున్న విశాఖ ఒకటో జోన్ ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్, సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు

కశింకోట: నూతన విద్యా విధానానికి అనుగుణంగా మారిన సిలబస్, పరీక్షల నిర్వహణ విధానాలపై బాధ్యులైన హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని విశాఖ ఒకటో జోన్ ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుడు కె. విజయ భాస్కర్ తెలిపారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో శనివారం జెడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, గురుకుల, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అమలులోకి వచ్చిన అంశాలపై ప్రత్యేక అవగాహన పెంచుకోవడం ద్వారా వాటిపై పట్టు సాధించుకోవచ్చన్నారు. నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మదింపు విధానాలతో వచ్చిన అసెస్మెంట్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. హెచ్‌ఎంలు తప్పనిసరిగా ఒక సబ్జెక్టును పూర్తిగా బోధించాలన్నారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా వారి విద్యా స్థాయిలను పరిశీలించాలన్నారు. డీఈవో గిడ్డి అప్పారావునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి జొన్నాడ అప్పారావు, పరీక్షల విభాగం సహాయ సంచాలకుడు శ్రీధర్‌రెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి సిహెచ్. సత్యనారాయణ, సీసీ వై. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవ ప్రదర్శనలు అమోఘం



బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు

తుమ్మపాల: రచనలు, నాటకాల రూపంలో సామాజిక సమస్యలను సమర్థంగా ప్రదర్శించి స్పష్టమైన సందేశాన్నిచ్చిన మహానుభావుడు బళ్లారి రాఘవ అని అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన రావు కొనియాడారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు శనివారం ఎస్పీ కార్యాలయంలో బళ్లారి రాఘవ 145వ జయంతి నిర్వహించారు. ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి మాత్రమే కాకుండా, సమాజం మార్పు వైపు దారితీసే శక్తిగా కళను ఉపయోగించిన మహానుభావుడు బళ్లారి రాఘవ అని తెలిపారు. ఆయన రచనలు నేటికీ ప్రజల్లో చైతన్యం నింపుతున్నాయన్నారు. నేటి సమాజ నిర్మాణంలో కళలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, విలువలతో కూడిన కళా అభిరుచి యువతలో పెంపొందించాలన్నారు. డీటీసీ డీఎస్పీ బి.మోహనరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మి, గఫూర్, ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు, గిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ఆర్టీసీ ప్రయాణికుల నిరసన

- కృష్ణారాయుడుపేట వద్ద కల్వర్టును యుద్ధప్రాతిపదికన నిర్మించాలని డిమాండ్



దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

దేవరాపల్లి: విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణారాయుడుపేట సమీపంలో కూలిన కల్వర్టును యుద్ధప్రాతిపదికన నిర్మించాలని ఆర్టీసీ ప్రయాణికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరసన చేపట్టారు. కృష్ణారాయుడుపేట, ఉగ్గినవలస గ్రామాల మధ్య కల్వర్టు కుంగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవరాపల్లి నుంచి వయా కొత్తవలస మీదుగా విశాఖపట్నం వెళ్లే మార్గంలో ప్రతి 15 నిముషాలకు 12డీ బస్సులు రాకపోకలు సాగించేవన్నారు. ఈ నేపథ్యంలో రెండు వారాలుగా ఆర్టీసీ యాజమాన్యం కొన్ని బస్సులను బ్రిడ్జి కూలిన ప్రాంతం నుంచి, మరికొన్ని బస్సులను కె.కోటపాడు మీదుగా విశాఖపట్నానికి తిప్పుతుందన్నారు. దాంతో అటు కొత్తవలస వైపు ఇటు దేవరాపల్లి వైపు రాకపోకలు సాగించే కొత్తవలస, వేపాడు, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో కల్వర్టు కూలిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజా సమస్యల పట్ల ఎంత బాధ్యతగా ఉందో అర్థమవుతుందన్నారు. ప్రయాణికులకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న మద్దతు పలికారు. రోజూ రాకపోకలు సాగించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నరక యాతన అనుభవిస్తున్నారని, వెంటనే కల్వర్టు పునర్నిర్మించి ప్రజలు కష్టాలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి వెంకయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు

నర్సీపట్నం: జాతీయ పతాక రూపకర్త స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 149వ జయంతిని శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద పింగళి వెంకయ్య విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి భారతీయుడు ఎప్పటికీ గర్వించే త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప మహనీయుడు పింగళి అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, యాదగిరి దాసు, కణితి వాసు, శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు.

ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి తరలింపు

- కశింకోటలో నలుగురు నిందితుల అరెస్టు
- 262 కిలోల గంజాయి, స్కార్పియో, స్కూటీ స్వాధీనం
- మరో ముగ్గురు పరారీ



గంజాయి, స్కార్పియో, నిందితులతో డీఎస్పీ శ్రావణి, పోలీసులు

కశింకోట: ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిపోతున్న దాదాపు అరకోటి రూపాయల విలువైన 262 కిలోల గంజాయిని శనివారం కశింకోటలో పోలీసులు పట్టుకున్నారు. నలుగుర్ని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. రవాణాకు వినియోగించిన స్కార్పియో, స్కూటీ, 4 సెల్‌ఫోన్లు, రూ.3200 స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి తమిళనాడుకు ప్యాకెట్ల రూపంలో బస్తాల్లో గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న విశ్వసనీయ సమాచారం నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో స్థానిక సత్తెమ్మ తల్లి మలుపు వద్ద ఎస్‌ఐలు కె. లక్ష్మణరావు, పి. మనోజ్‌కుమార్, సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీ, స్కార్పియో వాహనాలు అనుమానాస్పదంగా రావడం గమనించారు. పోలీసులను చూసిన వెంటనే స్కూటీపై ఇద్దరు వ్యక్తులు, కారులోని ముగ్గురు వ్యక్తులు వాహనాలను నిలిపి పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం నిట్టపుట్టు గ్రామానికి చెందిన అనుగూరి కొండబాబు, కె. కోటపాడు మండలం పైడంపేట గ్రామానికి చెందిన స్కార్పియో డ్రైవర్ చిరికి రాఘవ, బండారు గణేష్, పెదబయలు మండలం బొడ్డగొంది గ్రామానికి చెందిన అనుగూరి సోమేష్‌కుమార్‌లను పోలీసు బృందం పట్టుకుంది. స్కార్పియోలో గంజాయి ఉన్నట్లు ఒప్పుకోవడంతో దాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. ఒకరు మాత్రం పరారయ్యాడు. అతన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బొంగరం పంచాయతీ డోమలొడ్డు గ్రామస్తునిగా గుర్తించారు. ఇతడితోపాటు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పనికిబండ గ్రామానికి చెందిన వంతల ధనుర్జయ్, తమిళనాడుకు చెందిన రమేష్ ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. వీరిని పట్టుకోవడానికి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. గంజాయి పట్టుకున్నందుకు సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

క్లీనర్‌పై దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

- ఆర్థిక ఇబ్బందులతో హైవేలో చోరీలు
- పరవాడపాలెంలో పట్టుకున్న పోలీసులు



నిందితులతో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం వద్ద జాతీయ రహదారిపై చోరీ యత్నంలో భాగంగా లారీ క్లీనర్‌ను కత్తితో పొడిచి గాయపర్చి పరారైన ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ఇంటి సామగ్రి లోడ్‌తో ఒడిశాలోని పూరి వెళుతున్న లారీని గత నెల 31న ఇక్కడి నూతలగుంటపాలెం వద్ద విశ్రాంతి కోసం నిలిపారు. అక్కడ లారీ క్యాబిన్‌లో నిద్రిస్తున్న డ్రైవర్ మహేష్‌కుమార్ జేబులోని నగదు, సెల్‌ఫోన్‌ను సంచార జాతికి చెందిన పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన కేశవ పవర్, రాహుల్ పవర్ చోరీ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో కేకలు పెట్టడంతో వారు పరారయ్యారు. అదే సమయంలో మరో లారీలో నిద్రిస్తున్న క్లీనర్ శంకర్‌కుమార్ వద్ద నుంచి నగదు చోరీకి ప్రయత్నించగా గట్టిగా అరిచాడు. దాంతో అతని బారి నుంచి తప్పించుకునేందుకు నిందితుడు కేశవ్ తన వద్ద కత్తితో క్లీనర్‌ను వెనుక భాగంలో పొడిచాడు. వెంటనే మరో నిందితుడు రాహుల్‌తో కలిసి పారిపోయారు. ఈ విషయమై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానంతో పరవాడపాలెం గ్రామం వద్ద నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వీరిని కోర్టుకు తరలించారు. నిందితులు సంచార జాతికి చెందిన వారు, వీరు గ్రామాల శివారులో గుడారాలు వేసుకొని ఊర్లలో పగటి వేళ తిరిగి ప్లాస్టిక్ కుర్చీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై నిద్రించే డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతూ వచ్చారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఇటువంటి దొంగతనాలతో వీరికి సంబంధాన్ని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు. దొంగల పట్ల జాతీయ రహదారిపై వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలపై సత్వరమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్‌ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

క్లుప్తంగా

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని రెండో శ్రావణ శనివారం పురస్కరించుకొని వజ్ర కవచంతోపాటు వివిధ రకాల పూల మాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. భక్తులకు దేదీప్యమానంగా స్వామివారు దర్శనమిచ్చారు. విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లలితా సహస్ర నామా పారాయణ చేశారు. మహిళలు భక్తి పాటల ఆలాపనతో భజన కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కొత్తూరు గ్రామ కమిటీ ఎన్నిక

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీ వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడిగా మొల్లి నాగు ఎన్నికయ్యారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శనివారం కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడిగా వారాధి గణేష్, గౌరవాధ్యక్షులుగా మద్దాల శ్రీనివాసరావు, అనపర్తి శ్రీనివాసరావు, కార్యదర్శులుగా గైపూర్ చిరంజీవి, పూడి శ్రీనివాసరావు, సాయి విశ్వేశ్వరచౌదరి, జగడం ఏసు, తగరంపూడి శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా ఉడుముల నోబెల్, త్రినాథ్, గొల్ల నర్సింగరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, ఎంపీటీసీ మురుగుతి సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా వాయిదా

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన నిరుద్యోగ యువతకు నిర్వహించే జాబ్‌మేళాను తాత్కాలికంగా వాయిదా వేశామని సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోసారి కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి త్వరలో జాబ్‌మేళాను నిర్వహిస్తామన్నారు.

136 మందికి కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: పట్టణంలోని బాలల సత్వర చికిత్స కేంద్రంలో మైనింగ్ ప్రభావిత గ్రామాల రోగులకు కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. మండలంలోని మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో 136 మందికి కిడ్నీ వ్యాధి లక్షణాలు గుర్తించి వివధ రకాల పరీక్షలు చేస్తున్నారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ కిడ్నీ వ్యాధిన బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 75 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4.100	4,300
రెండో రకం	-	-
మూడోరకం	3,100	3,500

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్ డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: జూనియర్
పర్తిసాయి	: మహావతార్ నరసింహ
వెంకటేశ్వర	: లోపలకి రా చెప్పతా..
శ్రీ సత్య	: తమ్ముడు
రామచంద్ర	: హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-21, ఓ పాజిటివ్-29, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

- కూటమి పాలనలో 100 మందికే కార్డుల మంజూరు
- మిగిలిన వారికి కార్డులివ్వని వైనం
- వైఎస్సార్‌సీపీ హయాంలో 225 మందికి కార్డులు అందజేత
- ఏటా రైతు భరోసా సాయం, రాయితీలు వర్తింపు

కౌలు రైతుకు గుర్తింపేదీ?



తుమ్మపాలలో ఖరీఫ్ సీజన్‌కు పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

అనకాపల్లి: పొలాల్లో సైద్యం జరిగి, పంట ఉత్పత్తులు పెరుగుతున్నాయంటే కౌలు రైతులే కారణం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో రాయితీకి మాత్రం వీరు అర్హులు కారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వీరిని సాగు ఒప్పందం ఆధారంగా గుర్తించి ప్రభుత్వ పథకాలు, పరిహారాలు అందించి ఆదుకున్నారు. కూటమి పాలనలో కౌలు గుర్తింపు కార్డులిచ్చి ఆదుకున్న పాపాన పోలేదు. ఇంతవరకూ వంద మందికి మాత్రమే గుర్తింపు కార్డులు మంజూరు చేశారు.

అనకాపల్లి మండలంలో రైతులు 11,800 మంది ఉండగా, గత వైఎస్సార్‌సీపీ హయాంలో 225 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు ఏటా రైతు భరోసా సాయం ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వంద మంది కౌలు రైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చింది. అనకాపల్లి మండలంలో గతేడాది 6,200 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి వేస్తే, ఈ ఏడాది 7 వేలు ఎకరాల్లో సాగు చేయడానికి వరి నారుమడులు వేసుకుని రైతులు సిద్ధంగా ఉన్నారు. రైతులు, కౌలు రైతులు వరినాట్లు వేస్తున్నారు. విపత్తుల కారణంగా పంటకు నష్టం వాటిల్లితే సొంత పొలం ఉన్న రైతులకు ప్రభుత్వం ఎంతోకొంత నగదు సాయం అందిస్తుంది. కౌలు రైతులకు పంటనష్టం ఇచ్చేందుకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేస్తోంది.

కొత్త చట్టంతో మార్గం....

సొంత భూమిలేని కౌలు రైతులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు మంజూరు చేస్తుంది. భూ యాజమానులకు వారి భూమిపై ఉన్న హక్కును ఎలాంటి భయంలేకుండా 1956 రక్షిత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసి 2019లో కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టంలో భూ యాజమానులు హక్కుల రక్షణతోపాటు, వాస్తవంగా సాగుచేసే కౌలు రైతులకు పరిహారం, రాయితీ, పంట రుణం పొందేందుకు వీలుగా సాగుదారు కార్డులు మంజూరు చేసేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులు వ్యవసాయ శాఖద్వారా వచ్చే అన్ని రాయితీలు నేరుగా పొందుతున్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

కౌలు రైతు సాగుకార్డు పొందాలంటే...

- కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమానితో 11 నెలల సాగు ఒప్పందం చేసుకోవాలి.
- భూ యజమాని పాస్‌బుక్/ వన్‌బీ జెరాక్స్, ఆధార్ కార్డు సాగుదారునికి ఇవ్వాలి.
- కౌలు రైతుకు ఎటువంటి భూమి ఉండకూడదు.
- భూ యజమాని ఇచ్చిన పాస్‌బుక్, ఆధార్ కార్డు, 11 నెలల ఒప్పంద పత్రాలతోపాటు కౌలు రైతు ఆధార్‌కార్డు, ఫొటోను వీఆర్వోకు అందిస్తే, వారు కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరు చేస్తారు.
- ఈ పంట నమోదులో భూ యజమని స్థానంలో కౌలు రైతు వివరాలు నమోదుకు వీలుగా ఉంటుంది.

కౌలు రైతు గుర్తింపు కార్డుతో ప్రయోజనం

- విపత్తుల సమయంలో పంటనష్టం వాటిల్లితే తాను సాగుచేసే భూమికి ప్రభుత్వం నుంచి కౌలు రైతు పరిహారం పొందవచ్చు.
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిహారం రైతుకు, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది కౌలు రైతుకు అందుతుంది.
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ వ్యవహారమంతా రైతు భరోసా కేంద్రాల్లో జరిగేది. ఇప్పుడు రైతు సేవా కేంద్రంలో జరగడంలేదు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరిట కార్డులు మంజూరు చేస్తుంది.
- కౌలు రైతులకు 11 నెలల తర్వాత ఆ భూమిపై ఎలాంటి హక్కు ఉండదు. కొనసాగాలంటే మళ్లీ ఒప్పందాన్ని భూ యజమాని నుంచి తీసుకోవాలి.

కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకున్నా



విపత్తుల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపరిహారం ఇచ్చే సమయంలో కౌలు రైతు గుర్తింపు కార్డు పని చేసింది. విత్తనాలు, ఎరువులు తీసుకునేందుకు ఉపయోగపడుతోంది. భూ యజమాని కౌలు రైతుకు సహకరించాలి. లేదంటే ప్రకృతి విపత్తుల సమయంలో తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది.

– పి.సన్యాసినాయుడు, కౌలు రైతు, అనకాపల్లి మండలం


భూ యజమానికి ఇబ్బందులు ఉండవు



మండలంలో ఇంతవరకూ వంద మందికి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజురు చేశాం. కౌలు రైతు, భూ యజమాని మధ్య ఒప్పందం మేరకు వీఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఈ ఒప్పంద పత్రం 11 నెలలకు మాత్రమే ఉంటుంది. భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

– పిటి.రంగాచారి, మండల వ్యవసాయశాఖ అధికారి, అనకాపల్లి

సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం నేడు



అనకాపల్లి టౌన్: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని గవరపాలెం దాసరిగెడ్డ రోడ్డులోని సత్తెమ్మ తల్లి ఆలయ 34వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరగనుందని ఆలయ కన్వీనర్ బొడ్డేడ మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, మహిళలతో సామూహిక భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న ప్రసాద నిర్వహిస్తామన్నారు.

5న కరెంట్ ఆఫీస్‌ల వద్ద ధర్నా



మాట్లాడతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

అనకాపల్లి టౌన్: స్మార్ట్ మీటర్లను ఇంటింటికి బిగించడం మానుకోవాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నిరసిస్తూ ఈ నెల 5న కరెంట్ ఆఫీస్‌ల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం తెలిపారు. స్థానికంగా ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ మీటర్లకు వ్యతిరేకమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కన్వీనర్ గంట శ్రీరామ్, భీశెట్టి అప్పారావు, టి. సురేష్, రాజు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రాష్ట్రంలో ఆటో మోటారు వాహన డ్రైవర్లకు రూ.1,500లు ఇవ్వాలని, వాహనమిత్ర పథకం అమలుకు పెట్టిన షరతులను తొలగించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీవో కార్యాలయం ఆవరణలో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపి, కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికి కృషి చేస్తామని అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూటమి ప్రభుత్వం ఆటో, మోటార్ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఆటో డ్రైవర్లపై అక్రమ కేసులు పెట్టి అధిక చలానాలు రాస్తూ ఫైన్ విధించడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కోన లక్ష్మణ్, కోరిబిల్లి జగదీష్, పెదిరెడ్ల నాగేశ్వరావు, బంగారు రాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు



కశింకోటలో వెలవెల బోయిన ప్రధాన రహదారి

కశింకోట: ప్రజలు సూర్య తాపంతో విలవిలలాడారు. కశింకోటలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రత నెలకొంది. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి అధిక శాతం మంది సాహసించలేదు. అత్యవసర పనులున్న వారు మాత్రం తమ కార్యకలాపాలు సాగించుకోవడానికి వెళ్లక తప్పలేదు. వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతతో వృద్ధులు, పిల్లలు ఊపిరాడక అల్లాడారు. సూర్య తాపం వల్ల స్థానిక ప్రధాన పంచాయతీ రహదారి, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తగ్గి చల్లబడటంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు కురవాల్సిన తరుణంలో వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తుండటంతో ఇదేమి విధి వైపరీత్యమో? అంటూ ప్రజలు విస్తుపోతున్నారు.

'గుడ్, బ్యాడ్ టచ్'పై అవగాహన

అనకాపల్లి టౌన్: విద్యార్థులు న్యాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని దిశ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ తెలిపారు. స్థానిక డీఏవీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రతీ విషయం చెప్పాలన్నారు. ఆడపిల్లలతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా స్కూల్లో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి. మహదేవ శాస్త్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడికి అరుదైన రక్తం అందించి ప్రాణదానం

పెందుర్తి: పన్నెండేళ్ల బాలుడి కాలికి శస్త్రచికిత్స జరిగిన సమయంలో అవసరమైన అరుదైన గ్రూప్ రక్తాన్ని అందించి అరుణ్‌కుమార్ అనే వ్యక్తి రక్తదాతగా నిలిచారని పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీను తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నగరంలో గత శుక్రవారం స్కూల్ పిల్లల ఆటో బోల్తా పడి అందులో ఉన్న కర్రి మహేంద్ర(12) అనే బాలుడి కాళ్ల దగ్గర ఉండే ఆర్టరి నరం తెగిపోయిందన్నారు. బాలుడిని మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించగా.. శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని, ఆ సమయంలో ఓ పాజిటివ్ రక్తం అవసరమని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించారని చెప్పారు. దీంతో తెలిసిన రక్తనిధికి బాలుడి బంధువులను పంపగా.. అక్కడికి పట్టుకెళ్లిన రక్త నమూనా అక్కడున్న ఓపాజిటివ్ రక్తంతో సరిపోలేదన్నారు. క్షుణ్ణంగా పరిశీలించాక అది అత్యంత అరుదైన బొంబాయి బ్లడ్ గ్రూప్ అని నిర్ధారణ అయిందన్నారు. దీంతో అన్ని బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులను సంప్రదించామని, విశాఖలో ఒక్క సూర్యభాను ములగాడ అలియాస్ బొంబాయి సూర్య మాత్రమే బ్లడ్ అందిస్తారని వారు చెప్పారన్నారు.

తాము బొంబాయి సూర్యని సంప్రదించగా.. హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గాజువాకకు చెందిన ప్రాసాదుల అరుణ్‌కుమార్‌ది బొంబాయి బ్లడ్ గ్రూప్ అని అతడి వివరాలు చెప్పారన్నారు. సూర్య ఫోన్ చేయడంతో వెంటనే స్పందించిన అరుణ్‌కుమార్ వచ్చి బాలుడికి రక్తదానం చేశారన్నారు. అరుణ్‌కుమార్‌కు ఇటీవలే వివాహం జరిగిందని, ఇప్పటికి 15 సార్లు రక్తదానం చేశారని, చెన్నై కూడా వెళ్లి కూడా రక్తదానం చేయడం విశేషమన్నారు. ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శం కావాలని అభినందించారు.

రూపుదిద్దుకుంటున్న వినాయకులు

- ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో విగ్రహాల తయారీ
- రూ.100 నుంచి రూ.30 వేల వరకు ధరల్లో విక్రయాలు



ఘాట్‌రోడ్ జంక్షన్‌లో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు

మాడుగుల : మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వినాయక విగ్రహాలు తయారీ జరుగుతుంది. నాలుగేళ్లుగా ఇక్కడ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఇక్కడ నుంచి పాడేరు, అరకు తదితర జిల్లాలకు వందలాది విగ్రహాలు సరఫరా చేస్తున్నారు. మండలంలో కుమ్మరి కులస్తులు దసరా నుంచి శ్రీరామ నవమి వరకు ఇటుకలు తయారీకి దూర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. వర్షాకాలం రావడంతో వీరికి పని దొరికేది కాదు. ఇక్కడ వినాయక విగ్రహాల తయారీ కేంద్రం రావడంతో వర్షాకాలంలో వినాయక విగ్రహాలతో పాటు దేవీ విగ్రహాలు తయారు చేయడం వల్ల సుమారు ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 40 కుటుంబాలకు జీవనోపాధి దొరుకుతుంది. వివిధ రకాలు వాహనాలపై సిద్ధి వినాయకుడిని మలచడంతో ఎంతో ఆకట్టుకుంటున్నాయి. రూ.100 నుంచి రూ.30వేల వరకు ధరల్లో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. మాడుగుల నియోజకర్గంలోనే గ్రామానికి 3 నుంచి 5 విగ్రహాలు వరకు ఏర్పాటు చేస్తారు. దీంతో ఒక్క మాడుగుల నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాలకు ఎగుమతి చేయడానికి సుమారు 1800 విగ్రహాలు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో మూడు నెలల నుంచి వినాయక విగ్రహాల తయారీలో శిల్పులు నిమగ్నమై ఉన్నారు.

కూటమి ఏడాది పాలనలోనే ప్రజా వ్యతిరేకత

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్
- పాత బర్మాకాలనీ, మొండుపాలెంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ



మొండిపాలెంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న సమయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు విరక్తి వ్యక్తం చేస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో ఎంతో నష్టపోయామని వాపోతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ తెలిపారు. పట్టణంలోని 82వ వార్డు పరిధి పాత బర్మాకాలనీలో వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ కూటమి పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు ఎంతో వ్యత్యాసం తెలిసిందని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదని, ఏడాది పాలనలో విద్యుత్ చార్జీలు పెంచారని, నిత్యావసర ధరలు పెరిగాయని, కొత్త పింఛన్లు ఇవ్వలేదని, ఆడబిడ్డ నిధి చెల్లించలేదని, ఓటుతోనే బుద్ధి చెప్పుతామని స్పష్టం చేశారు. కూటమి పాలనలో మోసపోయామని, వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందేవన్నారు. సంక్షేమ పథకాలు అందలేదని, ఎవరిని అడగాలో అర్థం కావడం లేదని వాపోయారు. మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ ఒక మోసగాడు.. వేషగాడు కలిసి ప్రజలు మోసం చేస్తున్నారని విమర్శించారు. 2024 జూలై నుంచి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల హామీతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఏడాది వరకు వాటి ఊసెత్తలేదన్నారు. ఆడబిడ్డ నిధి రూ.1500 అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుంటే, టీడీపీ మంత్రి ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల పక్షాన తమ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పోరాటాలు చేస్తున్నారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ ఏడాది పాలనలో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. అంతకుముందు బర్మాకాలనీలో కోన ఉమా కుటుంబ సభ్యులు శాలువా, గజమాలతో మలసాల భరత్ కుమర్, వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బర్మా కాలనీ నాయకులు కోన ఉమ, కోటపాడు హరి, కోటపాడు శివ, మద్దాల ఈశ్వరరావు, బలిరెడ్డి నూకరాజు, ఇ.శివ, పి.వెంకట అప్పారావు, పార్టీ నాయకులు, కార్యర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మొండిపాలెం గ్రామంలో...

బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండలంలో సుందరయ్యపేట పంచాయతీ మొండిపాలెంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు భాదవు హరికృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీపై ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనకు...కూటమి పాలనకు గల వ్యత్యాసాన్ని తెలియజేశారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రజలు పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమునిగుమ్మంలో..

అనకాపల్లి: పట్టణంలోని 83వ వార్డు భీమునిగుమ్మంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.


రాయితీపై సమీకృత పశువుల దాణా



తాళ్లపాలెం గ్రామీణ పశు వైద్య కేంద్రంలో రాయితీపై దాణా పంపిణీ

కశింకోట: వేసవి గడ్డి కొరతతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న పాడి రైతులకు ఆసరాగా ప్రభుత్వం రాయితీపై సమీకృత పశువుల దాణాను అందిస్తుందని కన్నూరుపాలెం పశు వైద్య కేంద్రం వైద్యాధికారి డయానా తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం గ్రామీణ పశు వైద్య కేంద్రంలో పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై దాణాను శనివారం పంపిణీ చేశారు. 50 కిలోల బస్తా రూ.1,110 కాగా, రాయితీపోనూ రూ.555కు అందజేశారు. జేడీవో కరుణశ్రీ, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాలు ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వాణీ జగదీశ్వరి

అనకాపల్లి టౌన్: తల్లిపాలు అప్పుడే పుట్టిన బిడ్డకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణీ జగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పుట్టిన బిడ్డకు తగిన పోషకాలు అందాలంటే తల్లిపాలు ఒకటే మార్గమన్నారు. బిడ్డ పుట్టిన 30 నిమిషాల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో బి. మంగమ్మ, సిహెచ్‌వో శారద, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధనకు కృషి

- డీఐఈవో వినోద్‌బాబు

యలమంచిలి రూరల్: మారిన మొదటి సంవత్సరం సిలబస్‌కు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరగాలన్న సంకల్పంతో ఇంటర్మీడియెట్ విద్యా మండలి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి మద్దిలి వినోద్‌బాబు తెలిపారు.దీనిలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు దశల వారీగా ఆయా సబ్జెక్టులపై ఓరియంటేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మ్యాథ్స్ లెక్చరర్ల ఓరియంటేషన్ క్లాసులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ తరగతులను సద్వినియోగపర్చుకుని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా బోధన చేయాలని ఆయన అధ్యాపకులకు సూచించారు.

'బలవంతపు భూసేకరణ చేస్తే ఉద్యమిస్తాం'



భీమవరంలో రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : ఎర్రవాయి గ్రామాల రైతుల అనుమతి లేకుండా అధికారులు, రాజకీయపార్టీ నాయకులు బలవంతపు భూ సేకరణ చేపడితే రైతుల తరఫున ఉద్యమిస్తామని ఏపీ రైతు సంఘం,సీఐటియు నాయకులు శ్రీనివాసరావు, సాంశివరావు తెలిపారు. వీరు శనివారం ఆర్. భీమవరం, చిన భీమవరం గ్రామాల్లో పర్యటించారు. తాతల కాలం నుంచి భూములు సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అధికా రులు మాత్రం మాకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదని, పలువురికి తప్పుడు సర్వే నంబర్లతో రికార్డులు తారుమారు చేశారని పలువురు రైతులు వివరించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని మా భూములను పరిశ్రమలకు ఇవ్వబోమని వివరించారు. దీనిపై రైతుల అభిప్రాయం తీసుకోకుండా బలవంతపు భూ సేకరణ చేయడానికి చూస్తే మీకు అండగా ఉంటామని రైతు సంఘ నాయకులు రైతులకు హామీ ఇచ్చారు.